

10లోగా టెన్త్ ఫీజులు చెల్లించాలి : డిఇఒ

ప్రజాశక్తి - కలెక్టరేట్

డిసెంబర్ 10లోగా పదో తరగతి ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డివి రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, రెసిడెన్షియల్, ప్రైవేటు, మహాత్మా జ్యోతి, ఐటిడిఎ, కెజిబివిల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల లాగిన్ www.bsc.ap.gov.inలో ఫీజు చెల్లించాలని వివరించారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు వెబ్ సైట్ అందుబాటులో ఉంటుందన్నారు. రూ: 50 అపరాధ రుసుము తో డిసెంబర్ 20, రూ: 200 అపరాధ రుసుముతో డిసెంబర్ 25, రూ:500 అపరాధ రుసుముతో డిసెంబర్ 30 వరకు ఫీజును చెల్లించవచ్చని వివరించారు. ఆన్లైన్‌లో ఫీజును చెల్లించే సమయంలో ఎటువంటి తప్పులు లేకుండా ప్రధానోపాధ్యాయులుచర్యలు తీసుకోవాలని ఆ ప్రకటన లో సూచించారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు

క్రీడలతోనే ఆరోగ్యం

జగనన్న క్రీడా సంబరాలను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్

ప్రజాశక్తి కలెక్టరేట్

క్రీడలద్వారా మంచి దేహదారుఢ్యం, ఆరోగ్యం, తెలివితేటలు, చదువులో బాగా రాణించవచ్చునని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి అన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సిఎం నియోజకవర్గ స్థాయి జగనన్న క్రీడా సంబరాలను బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ, విదేశాల్లో మంచి పేరు ప్రఖ్యాతులు రావాలంటే కేవలం ఒక్క క్రీడల వల్లే సాధ్యమన్నారు. విద్యార్థులు క్రీడా సంబరాల్లో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. క్రీడల్లో రాణించడం వల్ల చదువు,ఉద్యోగ నియామకంలో ప్రభుత్వం ప్రత్యేక కోటా ఇచ్చి మంచి ప్రోత్సాహం అందిస్తుందనన్నారు. అలాగే ప్రభుత్వం రూ.5 లక్షల బహుమతితో ప్రోత్సాహం ఇస్తుందని దీన్ని మన జిల్లా క్రీడాకారులు సాధించి తీసుకొని రావాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లా చీఫ్‌కోచ్ ఎస్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వాలీ బాల్, కబడీ, క్రికెట్, బ్యాట్ మెంట్‌లో మహిళలు, పురుషుల జట్ల ఎంపిక జరుగుతుందని, మండల స్థాయిలో జరిగిన క్రీడలు ఈ రోజు నియోజకవర్గ స్థాయి జరుగుతాయని అన్నారు. జిల్లా స్థాయి పోటీలు ఈనెల 30 వరకు పార్వతీపురంలో జరుగుతాయని, అనంతరం జోనల్ స్థాయి పోటీలు డిసెంబర్ 6, 7 తేదీల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలో జరుగుతాయని, ఫైనల్స్ డిసెంబర్ 20న పులివెందులలో నిర్వహించడం జరుగుతాయని తెలిపారు. ఫైనల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.5లక్షలు, రెండోవ బహుమతి రూ.3లక్షలు, మూడో బహుమతిగా లక్ష రూపాయలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు కె.తిరుపతిరావు, ఎం.వాసుదేవరావు, శ్రీనివాసరావు, బి.రవికుమార్, ఎస్.దాలయ్య, పాఠశాల హెడ్ మాస్టర్ పి.చినరాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెత్తపై సమరం

సబ్‌కలెక్టర్ పర్యటనతో పాలకొండలో పారిశుధ్యం మెరుగుపడేనా?

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

డివిజన్ కేంద్రమైన పాలకొండ నగర పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందని చెప్పవచ్చు. 2013 మార్చిలో మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా మార్చినప్పటికీ మేజర్ పంచాయతీ కంటే పారిశుధ్య నిర్వహణ దారుణంగా ఉందని ప్రజలు అసంతృప్తి చెందుతున్నారు. 20 వార్డుల్లో 353 వీధుల్లో సుమారు 40వేల మంది జనాభా ఉండగా పారిశుధ్య నిర్వహణ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. గత నెల రోజుల నుంచి మరింత పారిశుధ్యం క్షీణించిందని స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఇటీవలే ఐఎఎస్ అధికారిని ఇక్కడ సబ్ కలెక్టర్‌గా నియమించడంతో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ గత 10 రోజుల నుంచి పట్టణంలో పర్యటించడంతో పారిశుధ్యం కొంత మెరుగుపడిందని స్థానికులు చెబుతున్నారు. ఆయన నగర పంచాయతీపై మరింత దృష్టిపెడితే అభివృద్ధి బాటలు పడతాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. అయితే పారిశుధ్య నిర్వహణకు అవసరమైన ప్రణాళిక నగర పంచాయతీ అధికారులు రూపొందించకపోవడమే ఈ పరిస్థితి ఎదురవుతుంది. వీధులతో పాటు కనీసం ప్రధాన రహదారుల్లో కూడా పారిశుధ్య నిర్వహణపై దృష్టిపెట్టిన పరిస్థితి లేదు. వ్యాపారులు విచ్చలవిడిగా వ్యవహరించి పారిశుధ్య నిర్వహణకు సహకరించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే పాలథిన్ నిషేధం అమల్లో ఉన్నప్పటికీ పక్కాగా అమలు చేయకపోవడం కూడా పారిశుధ్య నిర్వహణకు గుదిబండగా మారుతుంది. 40మంది పారిశుధ్య కార్మికులతోనే 20 వార్డుల్లోనూ పారిశుధ్యం నిర్వహణ చేయాల్సిన పరిస్థితి వస్తుంది. పట్టణ విస్తీర్ణంతో పాటు శివారు ప్రాంతాల్లో పారిశుధ్యం మరింత అధ్వాన్నంగా ఉండడం, సిబ్బంది లేమి సమస్యలు నగర పంచాయతీకి తలెత్తుతున్నాయి. కనీసం సిబ్బంది సంఖ్య పెంచాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ అటువంటి చర్యలు అధికారులు గానీ, పాలకులు తీసుకోకపోవడం వలన పారిశుధ్య నిర్వహణకు ఇబ్బంది ఎదురవుతున్నాయి. ఈ సమస్యలంటిపై సబ్ కలెక్టర్ దృష్టిసారిస్తే పట్టణంలో పారిశుధ్యం మెరుగుపర్చే అవకాశాలున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పారిశుధ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్



పారిశుధ్య నిర్వహణపై సబ్‌కలెక్టర్ అసంతృప్తి

పట్టణంలో ఎన్.కె.రాజపురం, గాయిత్రీనగర్, కొండవీధి ప్రాంతాల్లో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ బుధవారం విస్తృత పర్యటన చేపట్టారు. పారిశుధ్య నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్లపై చెత్త ఉండడం పట్ల నగర పంచాయతీ సిబ్బందిని మందలించారు. కొంతమంది సకాలంలో విధులకు హాజరుకాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని, సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆనంద్

నిర్ణయించిన ధరలకు పత్తి కొనుగోలు : జెసి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు పత్తి కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కాటన్ ప్రోక్యూర్ మెంట్ సమావేశంలో జెసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ధరకు పత్తిని రైతుల నుంచి కొనుగోలు చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. సాలూరు మార్కెట్ యార్డ్‌లో పత్తిని కొనుగోలు చేయడానికి కేంద్రం నిర్దేశించిన ధర కన్నా తక్కువకు కొనుగోలు చేయకూడదని, కాటన్ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. రైతులంతా స్థానిక సచివాలయాల్లో సిఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు పత్తి సహజమైన రంగు మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉన్నప్పుడే రైతులకు మంచి ధర లభిస్తుందన్నారు. రైతులంతా ఇ క్రాప్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. ఇ-క్రాప్ ఉన్న రైతుల వద్దే కేంద్రం పత్తిని కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. 8 శాతం తేమ కలిగిన పత్తి రకం రూ:6,380కు, 9 శాతానికి రూ.6,316.20కు, 10 శాతానికి రూ.6,252.40, 11 శాతానికి రూ.6188.60, 12 శాతానికి రూ.6124.80కు, 2 శాతం తేమ దాటిన పత్తిని కొనుగోలు చేసే అవకాశం లేదని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అగ్రిట్రెడ్, మార్కెటింగ్ శాఖ అధికారి ఎల్.అశోక్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి ఆర్.శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన అగ్నిమాపక అధికారి కె.శ్రీను బాబు, కేంద్ర పత్తి కొనుగోలు ప్రతినిధి పి.ప్రవీణ్ క్యారి, ఆర్‌టిఐ జి.సత్యనారాయణ, కాటన్ ట్రేడర్స్ ప్రతినిధి ఎస్.కణ్ణన్, పార్వతీపురం, సాలూరు, పాలకొండ ఎఎంసి కార్యదర్శులు బి.శ్రీనివాస రావు, బి.భారతీ, వి.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్‌లో తేడా లేకుండా చూసుకోవాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ప్రతి నెలా వచ్చే రేషన్‌లో స్టాక్‌లో తేడా లేకుండా చూసుకోవాలని ఐటిడిఎ పిఒ బి.నవ్య అన్నారు. బుధవారం జిసిసి సేల్స్ మేన్లు, ఎండియు వాహనాల ఆపరేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఇంటింటికీ రేషన్ సరఫరా సక్రమంగా జరగాలని సూచించారు. జిసిసి డిపోలకు వచ్చే స్టాక్‌ను ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్లి సరిచూసుకోవాలని అన్నారు. ఎండియు వాహనాలు కొండ ప్రాంతాలకు వెళ్లడం లేదని, లబ్ధిదారుల వేలిముద్రలు వేయడంలో సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని అన్నారు. సమావేశంలో లో పాలకొండ సబ్ కలక్టర్ నురూల్ కమల్, జీసీసీ డీఎం సంధ్యారాణి, తహసీల్దార్ నర్సింహమూర్తి, జీసీసీ మేనేజర్ ఆమోష్, సివిల్ సప్లయ్ డీటీ, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ నవ్య, సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

భామిని : మండలంలోని కొండలపై ఉన్న గిరిజన గ్రామాలలో ఇంటింటికి ఉచిత బియ్యం సరఫరాపై సబ్ కలెక్టర్ నూరల్ కమల్ బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎండిఎం ఆపరేటర్లు, డీలర్లు, జిసిసి సేల్స్ మన్, సిఎస్‌డిటిలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సవరపాడు జిసిసి పరిధిలో కొన్ని గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేక, వాహనాలకు కొండలు ఎక్కే సామర్థ్యం లేకపోవంతో, మరికొన్న ప్రాంతాల్లో సెల్ సిగ్నల్ లేక ఆ గ్రామాల్లో వున్న గిరిజనులు జిసిసికి సరుకులు మోసుకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. మరికొన్ని ప్రాంతాలకు వాహనాలు వెళ్లినా సిగ్నల్ ఉండడంలేదని, తీరా వాహనంతో బియ్యం పంపిణీకి వెళ్లినా ముందుస్తుగా వాలంటీర్లు సమాచారం ఇవ్వకపోవడం వలన కూలీ పనులుకు వెళ్లి పోతున్నారని తెలిపారు. బియ్యం పంపిణీని వాలంటీర్లు ప్రజలకు ముందుస్తు సమాచారం ఇవ్వడం లేదని ఎండిఎం ఆపరేటర్లు ఫిర్యాదు చేశారు. గత రెండు నెలలుగా రేషన్ షాపులకు కంది పప్పు, పంచదార సరఫరా లేదని, ప్రజలు ఈ విషయం అడుగుతున్నారని డీలర్లు తెలిపారు. సమావేశంలో సిఎస్‌డిటి మధుసూదనరావు, జిసిసి డివిజన్ మేనేజర్ సంధ్యారాణి, జిసిసి మేనేజర్ అమోష్, తహశీల్దార్ అప్పారావు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

రైతుల వద్ద గల ధాన్యం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని జీడి, పత్తి, మొక్క జొన్న రైతులను ఆదుకోవాలని రైతు సంఘం మండలకమిటీ సభ్యులు గంటా స్వామినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ధాన్యాన్ని సక్రమంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా కోనుగోలు చేయకపోవడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకొని నష్టపోయారని తెలిపారు. కనీసం ఈ ఏడాదైనా రైతు భరోసా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని, నిబంధనలు సడలించాలని డిమాండ్ చేశారు. గతంలో తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన పత్తి, మొక్క జొన్న, జీడి తదితర రైతులను ఆదుకోవాలని కోరారు. తుపాను వల్ల నష్టం జరిగి నెలలు గడిచినా రైతులకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. సమస్యలు పరిష్కారానికి రైతులందర్నీ సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, రైతులు అప్పలస్వామి, లక్ష్మణరావు, గిరిజన సంఘం నాయకులు చింత జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని కొత్తవలస వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, తుపాను కారణంగా నష్టపోయిన పత్తి, మొక్కజొన్న, జీడి పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ రైతు సంఘం నాయకులు వాల్‌పోస్టర్‌ను విష్కరించారు. ఈ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు మాదిరెడ్డి తిరుపతి నాయుడు, సహాయ కార్యదర్శి గంటా కృష్ణ, ఉపాధ్యక్షులు బొంగు కృష్ణ, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావుపాల్గొన్నారు



సాలూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

బలిజిపేట : స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యాన రైతు సమస్యల పరిష్కారం కోరుతూ వాల్‌పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం మండల నాయకులు గంట్యాడ బలరాం నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం ఎక్కడా కొనుగోలు చేయలేదన్నారు. ప్రభుత్వ ప్రచార్భాటం చేయకుండా తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మజ్జి దుర్గారావు, గౌరీశ్వరరావు, కళావతమ్మ, ఆదిలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వంజరాపు సత్యంనాయుడు, నల్ల ఈశ్వరరావు, వెంకటస్వామి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఆవు సాంబమూర్తి, మామిడి సింహాద్రి నాయుడు పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానికసుందరయ్య భవనంలో విఆర్ఎల సంఘం అధ్యక్షులు జి.ఈశ్వరరావు అధ్యక్షతన మండల అధ్యక్ష కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశం లో విఆర్ఎలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించారు. అనంతరం మన్మధరావు మాట్లాడు తూ విఆర్ఎలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, వారసత్వం హక్కు, నామినీలకు అవకాశం, అర్హులకు ఉద్యోగోన్నతి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రానున్న రోజుల్లో పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విఆర్ఎ సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణారావు, రామయ్య, తౌడు, సుదర్శన, సాంబ మూర్తి, వి.సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

వరి పంట కోతకు నూర్పులు అవుతున్న సమయం ఆసన్నమైందని, కావున రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం ప్రభుత్వమే నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా పూర్తి స్థాయిలో కొనుగోలు చేసేందుకు సన్నద్ధం కావాలని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు వ్యవసాయాధికారులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. ఈ వ్యవసాయ సిబ్బందికి ఎమ్మెల్యే పలు సూచనలు చేస్తూ కొనుగోలు సజావుగా సాగేందుకు దిశా నిర్దేశ చేశారు. ఇకెవైసికి అనుగుణంగా వాలంటీర్లు వారీగా ఎంత మంది రైతులు, ఎంత పంట దిగుబడి వస్తుంది అన్నది ముందస్తుగానే అంచనా వేసుకుని మండల, జిల్లా అధికారులకు సమగ్రమైన వివరాలతో కూడిన జాబితా అందజేయాలన్నారు. అలాగే రైతు భరోసా అందు కున్న ప్రతి రైతును ప్రత్యక్షంగా కలుసుకుని వారు పండించిన పంటను మరోసారి అడిగి తెలుసుకుని పక్కాగా నమోదు చేసి మొత్తం పంట దిగుబడి సమాచారం ప్రభుత్వానికి అందచేసినట్ట యితే అందుకు అనుగుణంగా ప్రభుత్వం కూడా ఆర్‌బికెల ద్వారా మొత్తం ధాన్యం కొనుగోలు చేసేందుకు పూర్తి స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వమే రైతుల వద్ద నుంచి ప్రతి గింజను మద్దతు ధర ఒక్కో క్వింటాల్‌కు రూ.2040కు కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా కల్పించాలని తెలిపారు. తేమ శాతం 17 కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులకు భరోసా కల్పించా ల్సిన బాధ్యత మీపై ఉందనిగ్రామ వ్యవసాయ సహాయకులకు, వాలంటీర్లకు ఎమ్మెల్యే తెలిపారు. ఎవరైనా తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎఒ ఎస్.అవినాష్, వైసిపి మండల కన్వీనర్ బి.శ్రీరాములు నాయుడు, నాయకులు ఆర్వీ, విఎఎలు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు



గాయపడ్డ ఆవును పరిశీలిస్తున్న జిల్లా అటవీశాఖాధికారులు

మళ్లీ పులి పంజా

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని డోకిశిల పంచాయతీ బుచ్చింపేటలో మేకను చంపి ఒక్కరోజు గడవకముందే పులి మళ్లీ పంజావిసిరింది. మంగళవారం రాత్రి అదే పంచాయితీ కొయ్యమెట్టవలసక గిరిజన గ్రామంలో పశువుల మందపై దాడి చేసి ఆవును చంపి తినేయగా, ఇంకొక ఆవును తీవ్రగా గాయపర్చడంతో ఆ ఆవు ప్రాణాపాయ స్థితిలో కొట్టిమిట్టాడుతుంది. బుధవారం వేకువన విషయం గ్రహించిన గిరిజన గ్రామస్తులు, స్థానిక నాయకులు వైసిపి మండల కన్వీనర్ బొమ్మి రమేష్‌కు విషయం తెలిపారు. వెంటనే ఆయన అటవీశాఖ అధికారులకు, సచివాలయ సిబ్బందికి అప్రమత్తం చేశారు.

సంఘటన స్థలాన్ని సందర్శించిన డిఎఫ్ఒ

విషయం తెలుసుకున్న జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన, రేంజర్ త్రినాధ, మక్కువ అటవీశాఖ అధికారి నారాయణరావు సిబ్బందితో కలిసి గాయపడిన పశువును, ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పులి కాలిముద్రలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్యం జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ఏనుగు, పులి సమస్యలను పరిష్కరించేందుకు ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని, నష్టపోయిన వారికి పరిహారం వెంటనే అందేలా చర్యలు తీసుకుంటామని, రాత్రుళ్లు ఎవరూ ఒంటరిగా సంచరించకుండా, పశువులు నష్టపోకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

యూత్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రాష్ట్ర ప్రభుత్వం సౌజన్యంతో జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 24న స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరగబోయే జిల్లా యూత్ ఫెస్టివల్ - 2022 వాల్‌పోస్టర్‌ను బుధవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆవిష్కరించారు. ఈ యువజనోత్సవాల్లో వివిధ రంగాలకు చెందిన కళాకారులు పాల్గొని తమ ప్రతిభనుకనబర్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లేందుకు అర్హులవుతారని అక్కడ కూడా విజయం సాధించిన వారు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం లభిస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని కళాకారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాస్థాయిలో జరిగే ఈ పోటీలకు జిల్లా యువజన సర్వీసుల శాఖతో పాటు ఐఆర్‌పిడబ్ల్యు సంస్థ ఏర్పాట్లు చేస్తున్నారు.

అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి : టిడిపి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన అంతం చేయడానికి టిడిపి శ్రేణులు సిద్ధం కావాలని టిడిపి అరకు పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జీ గుమ్మడి సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక లయన్స్ కల్యాణమండపంలో డిసెంబర్ 1నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబోయే ఇదేం కర్మ మన రాష్ట్రానికి అన్న కార్యక్రమంపై కార్యకర్తలకు, నాయకులకు అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి గడ్డుకాలం పట్టుకుందన్నారు. జగన్ సిగ్గుమాలిన సిఎం అని, అటువంటి వారిని గద్దె దింపాలని అన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని, దీన్ని ప్రజలు గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు టిడిపి కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని అన్నారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వ పాలనలో అరాచకాలు, అకృత్యాలు ఎన్నో జరుగుతున్నాయని, వీటన్నింటినీ తిప్పికొట్టే రోజులు దగ్గరపడ్డాయి అన్నారు. మళ్లీ టిడిపికి పూర్వవైభం వస్తుందని ఆ దిశగా అంతా కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కురుపాం, పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు జగదీశ్వరి, జయకృష్ణ మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబును మళ్లీ సిఎంను చేయడమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. లోకేష్ పాదయాత్ర విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజలకు ముందస్తు సమాచారమివ్వాలి

వీరఘట్టం : గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించినప్పుడు ముందుగా ప్రజలకు సమాచారం ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక బిసి కాలనీలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రజలకు అవగాహన కల్పించడం వల్ల గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు మంచి ప్రాధాన్యత లభిస్తుందన్నారు. గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. మంచాన పట్టిన రోగులను గుర్తించి వారికి వైద్య సాయం అందించాలన్నారు. నిమోయ వ్యాధిపై దృష్టి పెట్టాలన్నారు. అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలు, వసతి గృహాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యపై నిత్యం పర్యవేక్షణ జరపాలని సిబ్బందికి సూచించారు. ఈ చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ వైద్యాధికారి ఎస్-ఎస్ వర్మ, డిఎం యోగేశ్వర్‌రెడ్డి, సూపర్వైజర్ శాంతి కుమారి, ఎఎన్ఎం ఉష, టెక్నీషియన్ దినేష్, ఎంఎల్‌హెచ్‌పి భాగ్య రాధా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు



సీఎంను కలిసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

తోటపల్లి ఆధునికీకరణ పనులు చేపట్టాలి

పాలకొండ : తోటపల్లి కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కోరారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటపల్లి ఎడమ కాలువతో నీలానగరం ఓవర్‌హెడ్ ఛానల్‌కు అనుసంధానం చేసేలా చూడాలన్నారు. వీరితో పాటు రాజాం, పాతపట్నం ఎంఎల్‌ఎలు కంబాల జోగులు, రెడ్డి శాంతి ఉన్నారు.



విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

గురుకులాన్ని సందర్శించిన పిఒ

కురుపాం : మండల కేంద్రంలో గల ఏపి గురుకుల బాలికల పాఠశాలను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి విష్ణుచరణ్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. నిర్మాణం జరుగుతున్న కలవ్య పాఠశాల పనులను పరిశీలించి త్వరితగతిగా పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక సచివాలయం-1ను సందర్శించి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పర్యటనలో డిడి సూర్యనారాయణ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ

కురుపాం: ఇ-క్రాప్ ప్రతి రైతు నమోదు చేసుకోవడం వల్ల వారికి ఎంతో మేలు చేకూరుతుందని పెదగొత్తిలి పంచాయతీ సర్పంచ్ టి.లోకనాధం అన్నారు. బుధవారం సర్పంచ్ ఆర్‌బికె వద్ద ఇప్పటి వరకు ఇ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జి.భార్గవి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

పాచిపెంట : మండలంలోని గొట్టూరు, బొర్రామామిడి పంచాయతీలకు చెందిన 11మంది ఆదివాసీ యువతకు ఎలక్ట్రికల్, ప్లంబింగ్‌పై పది రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ద్వారా యువత జీవనోపాధి మెరుగుపర్చుకోవాలని లయ సంస్థ ఏరియా కో-ఆర్డినేటర్ బి.కాంతారావు అన్నారు. ఈ శిక్షణ ఆదివాసీ యువత వలసలు పోకుండా స్థానికంగా ఉపాధి పొందడానికి సహాయపడుతుందని గొట్టూరు ఎంపిటిసి సభ్యులు చెదల అంజలి అన్నారు. శిక్షణ ముగింపులో యువతకు ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనిముట్లు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయ సంస్థ కార్యకర్తలు చదల రాజు బి.రాజారావు, పి.తమ్మయ్య సిహెచ్.కన్నబాబు, సుందరరావు పాల్గొన్నారు.



ఎంపిపి ప్రమీలను పరామర్శిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఎంపిపికి డిప్యూటీ సిఎం పరామర్శ

పాచిపెంట: ఐటీడీఏ పిఎంఆర్ ఆస్పత్రిలో ప్రసవించిన స్థానిక ఎంపిపి బి.ప్రమీలను డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర బుధవారం పరామర్శించారు. మండలంలో మోదుగ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఆయన ఆస్పత్రికి వచ్చారు. అనంతరం తల్లీ బిడ్డ జాగ్రత్తగా ఉండాలని పలు ఆరోగ్య సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రమీల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందేందుకు ప్రజలకు స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు. పరామర్శించిన వారిలో మండల వైఎస్‌పి నాయకులు,కార్యకర్తలు ఉన్నారు

సక్రమంగా విధులు నిర్వహించాలి : జిల్లా రిజిస్ట్రార్

పాలకొండ : సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని జిల్లా రిజిస్ట్రార్ పూర్ణ చంద్రశాకర్ ఉద్యోగులకు ఆదేశించారు. బుధవారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఫిర్యాదులొస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని, రిజిస్ట్రేషన్‌కు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈయనతో పాటు సబ్‌రిజిస్ట్రార్ మూర్తి ఉన్నారు.

పనులు గుర్తించాలి

వీరఘట్టం : ప్రజలకు ఉపాధి కల్పించే పనులను గుర్తించాలని ఎపిఒ జి.సత్యనారాయణ ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పనులు గుర్తించడంతో పాటు చేసిన పనులకు సంబంధించి బిల్లులు కూడా తయారు చేయాలన్నారు. గ్రామాల్లో రహదారికి ఇరువైపులా వేసిన మొక్కలపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో టెక్నికల్ సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జిసిసిలో డిఎం పరిశీలన

భామిని : స్థానిక జిసిసి డిపోను బుధవారం డివిజన్ మేనేజర్ జి.సంధ్యారాణి పరిశీలించారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న బియ్యం, జిసిసి ఉత్పదనలు, పిఎం కల్యాణ్ యోజన ద్వారా బియ్యం పంపిణీ, రికార్డులను పరిశీలించారు. జిసిసి డిపో ద్వారా సకాలంలో బియ్యం పంపిణీ జరగాలని అన్నారు. కొన్ని వేళల్లో బయోమెట్రిక్‌కు సిగ్నల్ సమస్య ఉంటుందని, ఆ సమస్య లేనప్పుడు బయోమెట్రిక్ పూర్తి చేసి సరుకులు పంపిణీ చేసేలా చూడాలని తెలిపారు. ఆమె వెంట జిసిసి మేనేజర్ అమోస్, సేల్స్‌మన్లు ఉన్నారు.



శిక్షణనుద్దేశించి మాట్లాడుతున్న డిఇఒ రమణ

ఉపాధ్యాయులకు శిక్షణ

సీతానగరం : స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని డిఇఒ డివి రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణ పొందిన అంశాలను సులువైన పద్ధతిలో విద్యార్థులకు నేర్పించాలన్నారు. సైన్స్, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థులకు భయం పోగొట్టేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. శిక్షణలో తెలుగు, సైన్స్, గణితం ఉపాధ్యాయులు 50మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ రావు, ఎంఇఒ జి.సూర్యదేవుడు, శిక్షణ అధికారి జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పార్వతీపురంటౌన్ : పట్టణంలోని బంగారమ్మ కాలనీకి చెందిన గుండెబ్బి వంశీకృష్ణ రూ.7వేలు విలువచేసే ఆపిల్ ఐఫోన్ మంగళవారం పోగొట్టుకున్నారు. అదేరోజు రాత్రి చంద్రమౌళి అనే వ్యక్తికి ఫోన్ దొరకడంతో ఆయన పట్టణ ఎస్‌ఐ ఫక్రుద్దీన్‌కు అప్పగించారు. ఈ మేరకు వంశీకృష్ణకు బుధవారం చంద్రమౌళి సమక్షంలో ఫోన్‌ను ఎస్‌ఐ అప్పగించారు. నిజాయితీగా వ్యవహరించిన చంద్రమౌళిని ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది, ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి అభినందించారు.

ఇబ్బందుల్లేకుండా ధాన్యం సేకరించాలి

మండల సమావేశంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

రైతులు ఇబ్బందులకు గురికాకుండా ధాన్యం సేకరించాలని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.రమణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎస్ అవినాష్ మాట్లాడుతూ మండలంలో 15,430 ఎకరాలు ఇ-పంట నమోదైందని, ఈ ఏడాది 39,549 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నట్లు తెలిపారు. ప్రతి రైతు భరోసా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్యపురం, ఇప్పలవలస, పాపంవలస సర్పంచులు మాట్లాడుతూ ముందస్తుగా రైతులకు గోనె సంచులు అందించాలని వారు కోరారు.

ఆర్‌డబ్ల్యుఎస్ జెఇఇ పవన్ కుమార్ మాట్లాడుతూ మండలంలో 32 పనులకు గాను రూ.8 కోట్ల 88 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. జలజీవన్ మిషన్ కింద 52 గ్రామాలకు రూ.21.6 లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు గ్రామ సర్పంచులు చేసిన పనులకు బిల్లులు కాలేదని వాటిని మంజూరు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే కలుగుజేసుకుని బిల్లుల మంజూరుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అన్ని శాఖ అధికారులు గత సమావేశంలో ఇచ్చిన లక్ష్యాలను, సాధించిన ప్రగతిని వివరించారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, వైస్‌ఎంపిపి సూర్యనారాయణ, ఎంపిడిఒ బి.కృష్ణ మహేశ్ రెడ్డి, డిటి షేక్ ఇహ్రబ్రం, వివిధ శాఖ అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

ఐక్యతతో గెలిపించుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనులంతా ఐక్యతతో ఉండి స్వచ్ఛమైన గిరిజన అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని గిరిజన నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు ఐక్యతా రాగం వినిపించారు. స్థానిక కల్యాణ మండపంలో బుధవారం టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి అధ్యక్షతన గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మ వలస, కొమరాడ మండలాల నుంచి గిరిజన నాయకులు ఒకచోట సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక తమ్మయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లలో కేవలం గిరిజనులు 12ఏళ్లు మాత్రమే మూడుసార్లు ఎమ్మెల్యేలుగా కొనసాగారని అన్నారు. మిగిలిన 58 ఏళ్లు నకిలీ సర్టిఫికెట్లతో కురుపాం, చినమేరంగి రాజులు రాజకీయాన్ని తమ గుప్పెట్లో పెట్టుకుని, గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఎమ్మెల్యేలుగా కొనసాగి గిరిజన సంపద దోచుకుతిన్నారని ఆరోపించారు. ఇక రాజుల పాలనకు చమర గీతం పాడాలన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా తోయక జగదీశ్వరిని నియమించడం సంతోషకరమే అయినప్పటికీ నియోజకవర్గంలో సమన్వయ కమిటీలకు చెప్పకుండా నియమించడం దురదృష్టకరమని అన్నారు. రాజుల చెప్పు చేతుల్లో ఉండకుండా స్వతంత్ర నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితిలో ఆమె ఉన్నారన్నారు. కలుపుకొనే ధోరణి లేకపోవడం కూడా విచారకరమన్నారు. ఎమ్మెల్యే పదవి కోటలో ఉండాలని ఉద్దేశంతోనే ఇన్చార్జిగా జగదీశ్వరని నియమించారని అన్నారు. ఈసారి రాజులకు టిక్కెట్ ఇస్తే మద్దతు ఇచ్చే పరిస్థితి ఉండదన్నారు. వైసిపి హయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏజెన్సీలో విద్య, వైద్యం, తాగునీరు నేటికీ మెరుగుపడలేదన్నారు. గిరిజన బతుకులు బాగుపడాలంటే 2024 ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో నిజమైన గిరిజన వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇవ్వాలని పిలుపునిచ్చారు. గిరిజన ఐక్యత వర్ధిల్లాలి అంటూ చేయిచేయి కలుపుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మండంగి భూషణ, కొండలరావు, తాడంగి లక్ష్మణరావు, రామారావు, బిడ్డిక సుధ, కడాయి, చలపతిరావు, గంగాధర్ తదితరులు ఉన్నారు.

పిల్లలకు సార్వత్రిక టీకాలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రతి బుధ, శని వారాల్లో చిన్న పిల్లలకు నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాలకు సంబంధిత టీకా నిర్వహణ కార్డుల్లోనూ, ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సిబ్బందికి సూచించారు. పట్టణంలోని బంగారమ్మ కొలనీలో వైద్య సిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని డిఐఒ పర్యవేక్షించారు. టీకా నిర్వహణ కార్డులను, రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే చిన్న పిల్లలకు శీతాకాలంలో వచ్చే శ్వాస సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించి నివారణ చర్యలను వివరించారు. మొదటి ఆరు నెలలు తప్పకుండా చిన్న పిల్లలకు తల్లి పాలను ఇవ్వాలని తద్వారా రోగనిరోధక శక్తి పెరిగి ఇటువంటి శ్వాస సంబంధిత వ్యాధులు దరి చేరకుండా దోహదపడుతుందని డిఐఒ సూచనలు చేశారు. అనంతరం జిల్లా ఆసుపత్రిలో గల చిన్నపిల్లల న్యూట్రిషన్ రీహేబిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించి పిల్లల ఆరోగ్య స్థితిని పర్యవేక్షించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పుష్ప, జయ గౌడ్ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



టీకాలను నమోదు పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహన్

ఆర్‌బికెల్లో జీవ నియంత్రిత కారకాల తయారీ

పాచిపెంట: జీవ నియంత్రిత మందుల ద్వారా తక్కువ ఖర్చుతో మొక్కజొన్న పంటను ఆశిస్తున్న కత్తెర పురుగును నియంత్రించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు సూచించారు. మండలంలో తూడూరులో బుధవారం ఆయన మాట్లాడారు. మండలంలో అత్యధికంగా మొక్కజొన్న సాగుతుందని, ఈ పంటను కత్తెర పురుగు ఆశించి విపరీతంగా నష్టపరుస్తుందని అన్నారు. ఈ పురుగు నివారణకు వినియోగించే మందు సుమారు రూ.500 నుంచి రూ.900 వరకు ఖర్చవుతుందన్నారు. కావున తక్కువ కర్చుతో ఈ జీవ నియంత్రత కారకాల ద్వారా కత్తెర పురుగు, ఇతర రసం పీల్చు పురుగులను నివారించుకోవచ్చని తెలిపారు. అలాగే పొగాకు పంటకు ఆశించే పురుగుల నివారణకు జిల్లేడు కషాయాన్ని వినియోగించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద దండుపాటి రాము, ఎపిసిఎస్‌ఎఫ్ ప్రతినిధులు యశోద, తిరుపతి నాయుడు, ఐసిఆర్‌పిలు, విఎఎ దినేష్ పాల్గొన్నారు

సందివలసకు తాగునీరందించాలి

పార్వతీపురంరూరల్ : మండలంలోని వెలగవలస పంచాయతీ సందివలస గిరిజన గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని కోరుతూ బుధవారం గ్రామస్తులు ఎపిగిరిజన సంఘం నాయకులు పి.రాము ఆధ్వర్యంలో ఎంపిడిఒ అకిబ్‌జావేద్‌ను కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో గతంలో ఒక మంచినీటి చేతిపంపు ఏర్పాటు చేసినప్పటికీ దాని నుంచి చుక్క నీరు రావడంలేదన్నారు. నాయకులు, అధికారులు ఇంటింటికి కొళాయి అని చెప్పినప్పటికీ ఇంతవరకూ అలాంటి ప్రయత్నమే జరగలేదని, కనుక ఈ విషయమై స్పందించి, పరిశీలించి తగుచర్యలు చేపట్టాలని కోరారు.

25న వాహనాలకు వేలం

వీరఘట్టం : అక్రమంగా సారా తరలిస్తుండగా పట్టుబడిన వాహనాలను ఈనెల 25న స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ ఎం.హరికృష్ణ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఎస్‌పి సుభాష్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - సాలూరు :

విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం డిఎస్పీ ఎ.సుభాష్ కోరారు. బుధవారం స్థానిక శ్రీ సత్యసాయి జూనియర్ కళాశాలలో మన ఊరు -మన పోలీసు కార్యక్రమం లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫేస్ బుక్, వాట్సాప్ యూట్యూబ్ లకు ఆకర్షితులై విద్యార్థులు భవిష్యత్తు పాడుచేసుకోవద్దని సూచించారు. స్మార్ట్ ఫోన్‌తో ఎక్కువ సమయం కాలక్షేపం చేయకుండా చదువుపై శ్రద్ధ వహించాలని కోరారు. దిశ యాప్‌ను అంతా డౌన్లోడ్ చేసుకుని వేధింపులు ఎదురైనప్పుడు సమాచారం తెలియజేయాలని కోరారు. పోక్సో చట్టం, ఇతర చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐ శ్రీనివాసరావు, రామానుజన్ మేథ్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ రంభ రజనీకాంత్, ప్రిన్సిపాల్ సిహెచ్.ప్రసాదరావు పాల్గొన్నారు.తొలుత రూరల్ పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. అక్కడ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంటనే ఎస్‌ఐ ప్రయోగమూర్తి ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గిరిజనులు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ అన్నారు. మండలంలోని మారుమూల గ్రామాలైన కుశ, పాములు గీశాడా, శంభుగూడ నోంద్రుకోన గ్రామాల్లో మన ఊరు మన పోలీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆపదలో ఉన్న మహిళల రక్షణకు ప్రభుత్వం దిశ, నిర్భయ, పోక్సో చట్టాలను కఠినంగా అమలు చేస్తుందన్నారు. దిశ యాప్ ఆపద సమయంలో రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని వివరించారు. గ్రామాల్లో బాలివివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. చిల్లంగి చేతబడి వంటి మూఢనమ్మకాలను నమ్మవద్దన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ షణ్ముఖరావు సిబ్బంది ఉన్నారు.

పూతికవలసలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్

సీతంపేట: మండలంలోని పూతిక వలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం గుడ్ టచ్ బ్యాడ్ టచ్ కార్యక్రమం ఎస్సై ఎ.నీలకంఠ రావు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నివారించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. దిశ యాప్ తెలియజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శారద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కోసింగి భద్ర ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తాటికొండ పిహెచ్‌సి 104 సీనియర్ వైద్యులు గుడివాడ ప్రభాకర్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శీతాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరమైన మేరకు మందులు పంపిణీ చేశారు.

వేగవంతంగా ఉపాధి పనులు

పాలకొండ రూరల్ : ఉపాధి హామీ చట్టం ద్వారా కూలీలతో జరుగుతున్న పనులు వేగవంతంగా చేయించాలని ఎంపిడిఒ డొంక త్రినాధులు అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ ఉపయోగపడే పనులు చేసేలా దృష్టిపెట్టాలన్నారు. ఎక్కడ ఎటువంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి సత్యం, ఎపిఒ ఈశ్వరమ్మ తదితరులున్నారు.

ధాన్యం నమూనాలు సేకరణ

పార్వతీపురంరూరల్ : మండలంలో ఇప్పటికే యంత్రాలతో వరినూర్పిళ్లు జరిగిన గ్రామాల్లో వ్యవసాధికారులు సందర్శించి ధాన్యం నమూనాలను సేకరించి, పంటను భద్రపర్చుకొనేందుకు సంచులు అందించే కార్యక్రమం చేపడుతున్నారు. బుధవారం ఎఒ ఆర్.రేఖ ఆధ్వర్యంలో కృష్ణపల్లి, పెదబొండపల్లి, ములగ, గంగాపురం గ్రామాల్లో కళ్లాలలో ఉన్న ధాన్యం రాశులను పరిశీలించి, వారికి సంచులు అందించారు. శాంపిల్లు తీసుకుని, కొను గోలు ప్రారంభం అయిన వెంటనే సరుకును తరలిస్తామని తెలిపారు.

వెంకంపేట పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

పట్టణంలోని వెంకంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శన చేపట్టారు. హెచ్‌ఎం పరంకుశంనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిని మండల స్థాయిలో 23న జరగనున్న పోటీల్లో ప్రదర్శించనున్నట్టు హెచ్‌ఎం తెలిపారు



తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న గిరిజనసంఘం నాయకులు

గిరిజనులకు సాగు పట్టాలు ఇవ్వాలి

పార్వతీపురం రూరల్: తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు ధర్నా చేశారు. ఈ మేరకు తహశీల్దార్ శివన్నారాయణకు వినతిని అందించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా నాయకులు, రావికోన సర్పంచ్ కె.రామస్వామి మాట్లాడుతూ మండలంలో గత 30 ఏళ్ల నుంచి సాగు చేస్తున్న బంజరు, కొండ పోరంబోకు, గెడ్డ పోరంబోకు భూములను సర్వే చేసి పట్టాలివ్వాలని గత రెండేళ్ల నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని, లేకుంటే భవిష్యత్తులో ఆందోళన చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.ఇందిర, పి రాము, పెద్దసంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

కెజిబివిని సందర్శించిన డిఇఒ

మక్కువ : మండలంలోని కాశీపట్నంలో గల కెజిబి విద్యాలయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి డివి రమణ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా విధానం గురించి పరిశీలించారు. అలాగే విద్యార్థినులకు అందించే భోజనానికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు అనంతరం ఎస్‌ఒ నాగదుర్గతో సమావేశమై అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఒ శ్రీనివాసరావు, ఎపిఒ శంకరరావు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాల పర్యవేక్షణ

సీతానగరం : వైయస్సార్ పంట బీమా పథకం కింద మండలంలో 128 వరి పంట ప్రయోగాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ మండలంలో 60 పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ మేరకు జిల్లా ముఖ్య ప్రణాధికారి పి.వీర్రాజు మండలంలోని బుడ్డిపేటలో పైలా కృష్ణ పొలంలో వరి 5×5 పంట కోత ప్రయోగాన్ని బుధవారం పరిశీలించారు. 5×5 మీటర్‌లో ప్లాట్ దిగుబడి 19.840 కిలోలు వచ్చిందని, దీని ఆధారంగా ఎకరాకు సుమారు 38 బస్తాలు ధాన్యం దిగుబడి రావచ్చని వ్యవసాయ గణాంకాలు తెలియజేస్తున్నాయని తెలిపారు. అలాగే కె.సీతారాంపురంలో పంట కోత ప్రయోగం పర్యవేక్షించారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడం వల్ల పంట దిగుబడి ఆశాజనకం ఉందన్నారు. ఒక యూనిట్‌లో వచ్చిన దిగుబడి ఆధారంగా పంటల భీమా, ధాన్యం కొనుగోలు రాష్ట్ర జిడిపి నిర్ణయిస్తున్నట్లు సిపిఒ తెలిపారు. కార్యక్రమంలో ఉపగణాంక అధికారి, మండల గణాంక అధికారి, విఎఎ, గ్రామ రైతులు పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో 11వ వ్యవసాయ గణనపై గ్రామ రెవెన్యూ అధికారులకు సూచనలను ఆధ్వర్యంలో అందజేశారు. 11 వ్యవసాయ గణన సకాలంలో నాణ్యమైన డేటాతో విఆర్‌ఒలు గణన చేయాలని సూచించారు.

సేవా మార్గంలో నడవాలి : ఎంఎల్‌సి

ప్రజాశక్తి-పాలకొండ

సత్యసాయిబాబా సూచించిన సేవా మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలో సత్యసాయిబాబా 97వ జయంతి సందర్భంగా బుధవారం సత్యసాయి బాబా ఆలయ ప్రాంగణంలో కేక్‌ను కట్‌చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయిబాబా ఎంతో మందికి ఆదర్శప్రాయుడని అభివర్ణించారు. ఈ సందర్భంగా పేదలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షులు నేతాజీనాయుడు, స్థానిక సత్యసాయి సేవాసమితి కన్వీనర్ కిశోర్, కౌన్సిలర్లు నీలాపు శ్రీనివాసరావు, గంగునాయుడు తదితరులున్నారు.



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గర్భిణులకు సామూహిక సీమంతాలు

జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగిలో సాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం డిఆర్‌కె ఫౌండేషన్ సౌజన్యంతో 20మంది సామూహిక సీమంతాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి ముఖ్య అతిథిగా హాజరై గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు రవణమ్మ, ఎంపిటిసి సభ్యులు అన్నపూర్ణ, మండల కోఆప్షన్ సభ్యులు శివబ్రహ్మ, డిఆర్‌కె ఫౌండేషన్ సభ్యులు, సాయి సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేదరోగులకు పండ్లు, రొట్టె ల పంపిణీ

సాలూరు: శ్రీ సత్యసాయి బాబా 97వ జయంతి సందర్భంగా స్థానిక సత్యసాయి జూనియర్, డిగ్రీ కళాశాలలో బాబా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు బంగారమ్మపేట, కూర్మరాజుపేట యుపి పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో పేదరోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. నిరుపేదలకు బియ్యం పాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామానుజన్ మేథ్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ రంభ రజనీకాంత్, లయన్స్ క్లబ్ డైమండ్స్ డైరెక్టరుల కొల్లి గిరిబాబు, సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ లు జి.భాస్కరరావు, సిహెచ్.ప్రసాదరావు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ

సీతంపేట : సత్యసాయిబాబా జన్మదినం సందర్భంగా సాయిరాం మందిరం ప్రాంగణంలో వృద్ధులకు, పేదలకు దుప్పట్లు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తూ పేదలకు దుప్పట్లు చీరలు పంపిణీ చేస్తున్నామని నిర్వహికులు తెలిపారు

అన్నదానం

వీరఘట్టం: స్థానిక సాయి నగర్ కాలనీ వద్దగల శ్రీ సత్యసాయి మందిరంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్య సాయిబాబా జన్మ దిన వేడుకల్లో భాగంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు కన్వీనర్ వి.విశ్వ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ జి.మురళీకృష్ణ, కిల్లరి సన్యాసినాయుడు, ఏ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ఉదయపురం పంచాయతీ దూళికుప్ప, కొత్తగూడ, కాకితాడ, ఉదయపురం గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నవరత్నాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే సచివాలయ సిబ్బంది దష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, మండల కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, వైస్ ఎంపిపి రంగారావు, కురుపాం సర్పంచ్ జి.సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది వాలెంటర్లు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం

పాచిపెంట : మండలంలోని కేసలి, మోదుగ పంచాయితీల్లో గల కుంతాం, ఊబిగుడ్డి, సేరు గుడ్డి, ఇప్పలగుడ్డి తదితర గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం రాజన్నదొర ఇంటింటికీ వెళ్లి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. సాంకేతిక కారణాలవల్ల ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే తమకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి సావిత్రి. పి.వీరంనాయుడు, డోల బాబ్జి, టి.గౌరీశ్వరరావు, కె.రవీంద్ర, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.,

సరిహద్దు గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ రూరల్: సీతంపేట మండలంలో సరిహద్దు గ్రామాల సమస్యల పరిష్కరించాలని ఎమ్మెల్యే వి.కళావతి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను కోరారు. బుధవారం ఆమె సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతూ కొత్తూరు మండలం నుంచి సీతంపేటలో ఈ గ్రామాలు కలపడంతో వాటికి సరిహద్దు సమస్యలు తరచూ వస్తున్నాయని, జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం చేసుకుందామంటే ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

భామిని: మండలంలోని పెద్దిదిమిలి పంచాయతీ పరిధిలో సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, తమ పేరున మార్చుకున్నారని, సమగ్ర భూ - సర్వేలో భాగంగా అక్రమంగా తీసుకున్న ప్రభుత్వ భూమిని గుర్తించి, స్వాధీనం చేసుకుని, రెవెన్యూ పరిధిలో పంచాయతీ అభివద్ధికి, ప్రభుత్వ సంబంధం నిర్మాణాలకు వినియోగించాలని ఆ గ్రామ సర్పంచ్ తోగారానా శ్రీను, గ్రామస్తులు సబ్ కలెక్టర్ నూరల్‌కమర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ అప్పారావు, సర్వేయర్ రామ్మోహన్ వున్నారు.